

రైతులకు ప్రభుత్వం తీపికబురు అందించబోతున్నది. వ్యవసాయానికి పెట్టుబడి కోసం బ్యాంకుల నుంచి రుణాలు పొందిన రైతులకు చింత తీరనున్నది. ఎన్నికల వేళ ప్రకటించినట్లుగా రూ.2 లక్షల వరకు రైతు రుణాన్ని మాఫీ చేసేందుకు కాంగ్రెస్ సర్కారు వడివడిగా అడుగులు వేస్తున్నది. ఆగస్టు 15వ తేదీలోగా రుణమాఫీ ప్రక్రియను పూర్తిచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు ప్రకటించగా, తాజాగా కేబినెట్ సమావేశంలోనూ నిర్ణయించడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూన్ 22



రుణం తీర్చే వేళైంది

- వచ్చే నెల నుంచి రుణమాఫీకి కసరత్తు
- అన్నదాతల్లో చిగురించిన ఆశలు
- జిల్లాలో 2.09 లక్షల మంది రైతులకు లబ్ధి
- రూ.2,026 కోట్ల రైతు రుణాలు

వచ్చే నెల నుంచే రైతు రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. ఆ దిశగా జిల్లాలో రుణాలు అందించిన బ్యాంకుల నుంచి వివరాలను సేకరించారు. రైతుల ఖాతాల వారీగా పొందిన రుణాల మొత్తాన్ని ఇప్పటికే గణించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 2.80లక్షల మంది రైతులు ఉన్నారు. దాదాపు వీరందరూ గత ప్రభుత్వంలో రైతుబంధు.. తాజా ప్రభుత్వంలో రైతుభరోసా పెట్టుబడి సాయం పొందిన జాబితాలో ఉన్నారు. కాగా వీరిలో 75 శాతం మంది రైతులు వివిధ బ్యాంకుల నుంచి రుణాలు పొందినట్లుగా అంచనా.

రూ.2,026 కోట్లు

జిల్లాలోని వివిధ బ్యాంకుల నుంచి రైతులు పొందిన రుణాల వివరాలను లీడ్ బ్యాంకు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఈ లెక్క ప్రకారం రూ.2,026 కోట్లుగా తేలింది. 2018 డిసెంబరు నుంచి 2023 డిసెంబరు 9వ వరకు రుణాలు పొందిన వారికే మాఫీ జరుగుతుందని తాజాగా ప్రభుత్వం ప్రకటించింది. దీంతో 2.09 లక్షల మంది ఈ జాబితాలో ఉన్నారు. వీరి ఖాతాలపై బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రూ.2లక్షల వరకు రుణాన్ని మాఫీ చేయడానికి చర్యలు ప్రారంభిస్తున్నారు.

గతంలో నిలిచిపోయిన వారికి అందేనా?

2014 నుంచి 2018 నవంబరు వరకు రుణాలు పొందిన రైతులకు గత ప్రభుత్వం రూ.లక్ష వరకు మాఫీ చేస్తామని ప్రకటించింది. అప్పుడు 1.72 లక్షల మంది రైతులు రూ.1316 కోట్ల రుణం పొందగా.. 98,828 మందికి రూ.568 కోట్లను దశల వారీగా మాఫీ చేశారు. రూ.25వేలు, రూ.50వేలు, రూ.75వేలు, రూ.99వేలుగా నిర్ణయించి రుణాన్ని మాఫీ చేసినట్లుగా ప్రకటించారు. లక్షకుపైగా రుణం పొందినవారికి ఈ జాబితాలో చోటు దక్కలేదు. రూ.లక్ష రుణం పొందిన వారికి మాఫీ జరగలేదనే ఫిర్యాదులు వచ్చాయి. అయితే అన్ని వర్గాలకూ మాఫీ చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. తర్వాత పరిణామాల మూలంగా నిలిచిపోయింది. ప్రస్తుత రుణమాఫీకి 2018 డిసెంబరు నుంచి ప్రామాణికంగా తీసుకోనుండడంతో అంతకుముందు రూ.లక్ష రుణాలు మాఫీ కానీ కొందరి పరిస్థితి అంతే సంగతులా తెలియాలి.

కుటుంబమే ప్రామాణికంగా..

ఒక కుటుంబంలో ఐదుగురి పేరిట తలా రూ.లక్ష చొప్పున రుణం పొందితే ఆ మొత్తం రూ.5లక్షలు అవుతుంది. కానీ వారికి రూ.2లక్షల వరకే రుణమాఫీ పరిమితి ఉంటుంది. ఐదుగురిలో ఇద్దరి ఖాతాలకే మాఫీ వర్తిస్తుంది. రేషన్‌కార్డును కూడా ఇందులో అనుసంధానం చేయనున్నారు. అందులోని కుటుంబసభ్యుల పేర్లను సైతం పరిశీలిస్తారు. రేషన్‌కార్డు లేనివారికి ప్రత్యామ్నాయాన్ని నిర్ణయించనున్నారు. ఒక కుటుంబంలో ఒక్క రైతు పేరిటనే రూ.2లక్షల రుణం పొందితే అది పూర్తిగా మాఫీ అవుతుంది. ఖాతాల వారీగా మాఫీలు చేసినట్లయితే ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతుందని భావిస్తున్నారు. అందుకే రూ.2 లక్షల వరకే పరిమితి విధించేలా కసరత్తు చేస్తున్నారు.

మార్గదర్శకాలపై ఉత్కంఠ

రుణమాఫీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికీ కొంతమందిలో ఉత్కంఠ తప్పడం లేదు. రూ.2 లక్షల రుణమాఫీకి అర్హత పొందాలంటే రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వీటి విషయంలో ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ చెల్లింపుదారులు మాఫీకి అనర్హులనే ప్రచారం జరుగుతోంది. దీనిపై ఆ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. 2023 డిసెంబరు 9 కటాఫ్ విధించగా.. ఆ తర్వాత రుణాలు పొందినవారు కూడా తమను పరిగణనలోకి తీసుకోవాలని అడుగుతున్నారు. కాగా ఒకేసారి రూ.2లక్షల వరకు మాఫీ కోసం రైతులు ఎదురుచూస్తుండగా, దశల వారీగా రుణమాఫీ చేస్తారా అనే విషయంపై చర్చ కొనసాగుతోంది.

గౌరవెల్లి కాల్వల భూసేకరణ పూర్తి చేయాలి

- రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట, జూన్ 22 : రైతులకు సాగునీరు అందించేందుకు త్వరగా గౌరవెల్లి రిజర్వాయర్ డిస్ట్రిబ్యూటరీ కాల్వలకు సంబంధించిన భూసేకరణ పూర్తి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమీకృత భవనంలో రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణాలకు అక్కన్నపేట మండలంలో 132 ఎకరాలు, హుస్నాబాద్ మండలంలో 235 ఎకరాలు, కోహెడ మండలంలో 304 ఎకరాల భూమి సర్వే, పెగ్ మార్కింగ్‌ను జూలై 10వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మళ్లీ జూలై 11న సమావేశం నిర్వహిస్తానన్నారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ 95 శాతం పూర్తి కాగా, మిగతా పనులు పూర్తి చేసేందుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను అనుమతి కోరాలని అధికారులను ఆదేశించారు. మెయిన్ కెనాల్‌లోకి నీరు వస్తే రైతులకు నమ్మకం పెరిగి డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణానికి సహకరిస్తారని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు కింద కవర్ కాని నియోజకవర్గంలోని గ్రామాలకు, దేవాదుల, రంగనాయకసాగర్‌ల ద్వారా సాగునీరందించేందుకు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పక్కన కలెక్టర్ మనుచౌదరి తదితరులు

రూ.150 కోట్లతో ప్రతిపాదనలు

హుస్నాబాద్, జూన్ 22 : హుస్నాబాద్ పట్టణ అభివృద్ధికి రూ.150 కోట్లతో ప్రతిపాదనలను చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. మున్సిపాలిటీలో చేయాల్సిన అభివృద్ధి పనులపై అధికారులు మంత్రికి పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ బైపాస్ రోడ్డు, కూడళ్ల సుందరీకరణ, ఎల్లమ్మ చెరువు అభివృద్ధి పనులను చేపట్టబోతున్నామన్నారు. పట్టణంలో జరుగుతున్న నేషనల్ హైవే పనులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



బొట్టు బొట్టు ఒడిసి పట్టి

తొగుట గ్రామానికి చెందిన నారిండ్ల లక్ష్మి రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేసింది. వర్షాలు సరిగా పడకపోవడంతో పంట ఎండిపోతుందని డ్రిప్ సిస్టమ్ ఏర్పాటు చేయించింది. తన పక్క పొలం వాళ్లు నాలుగు ఎకరాలలో పత్తి సాగు చేశారు. వాళ్ల బోరు చెడిపోవడంతో లక్ష్మి తన బోరు బావి నుంచి పైపు ద్వారా వారి పంటకు నీటిని అందిస్తుంది. పక్క పొలం వారికి నీళ్లు వెళ్తున్నప్పుడు పైపు ద్వారా లీక్ అవుతున్న నీటిని వృథాగా పోనివ్వకుండా మట్టికుండలో బొట్టు బొట్టు ఒడిసి పట్టి తన పొలంలోని మొక్కజొన్న మొలకలకు పోస్తుంది.

- జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి), జూన్ 22

జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి

- సహకరించిన అందరికీ కృతజ్ఞతలు
- జడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ

సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 22 : ఇప్పటివరకు సహకరించిన నాయకులకు, అధికారులకు జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ముందు ముందు కూడా ఇలాగే ఉత్సాహంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆమె కోరారు. శనివారం సిద్దిపేటలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన స్థాయీ సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయం, విద్యా, వైద్యం అంశాలపై సమావేశం కొనసాగింది. ఈ సందర్భగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు ఎదరవకుండా చూడాలని అధికారులకు సూచించారు. రైతుబంధు అందరికీ అందేలా చూడాలని, నకిలీ విత్తనాలను అరికట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మరింత విద్య ప్రమాణాల స్థాయి పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రమేష్, జడ్పీటీసీలు, స్థాయీ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



స్థాయి సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ



సిద్దిపేట అర్బన్ మండలం నాంచారుపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు

2,034 మంది ప్రైవేటు నుంచి ప్రభుత్వ బడికి

- బడి బాటతో సర్కారు పాఠశాలలో పెరిగిన ప్రవేశాలు
- మొత్తం 5,339 మంది విద్యార్థులకు ఈఏడాది అడ్మిషన్లు
- గతేడాదితో పోలిస్తే 296 మంది అధికం

సిద్దిపేట క్రైం, జూన్ 22 : ఈసారి నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం గతేడాదితో పోలిస్తే మెరుగైన ఫలితాలను తీసుకొచ్చింది. ఆరో తేదీ నుంచి 19వ తేదీ వరకు కొనసాగిన బడిబాటలో ప్రైవేటు స్కూళ్ల నుంచి ఏకంగా 2,034 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ తీసుకోవడం విశేషం. కలెక్టర్, విద్యాశాఖ శాఖ అధికారుల సూచనలతో జిల్లాలో 14 రోజుల పాటు నిర్వహించిన బడిబాట కార్యక్రమం విజయవంతమైంది. జిల్లాలో 559 ప్రాథమిక పాఠశాలలు, 113 ప్రాథమికోన్నత పాఠశాలలు, 220 ఉన్నత పాఠశాలలు, 14 ఆదర్శ పాఠశాలలు, 22 కేజీబీవీలు ఉన్నాయి. ఈసారి బడిబాట కార్యక్రమం ద్వారా అన్ని పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగింది. ప్రభుత్వ పాఠశాలలో మొత్తంగా 5,339 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. గత సంవత్సరం బడిబాటతో 5,043 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరగా ఈసారి 296 విద్యార్థులు ఎక్కువగా చేరారు. ఒకటో తరగతిలో 3,450 మంది విద్యార్థులు చేరారు. వీరిలో అంగన్‌వాడీ కేంద్రాల నుంచి 2,909 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 338 మంది, నేరుగా 203 మంది చేరారు. రెండు నుంచి పదో తరగతి వరకు 1,889 మంది విద్యార్థులు చేరారు. వీరిలో ప్రైవేట్ పాఠశాల నుంచి 1696 మంది, బడి మానేసిన విద్యార్థులు 194 మంది ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మంచి ఫలితాలు



జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంచి ఫలితాలు వస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యా బోధన జరుగుతున్నది. నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాంలు ఉచితంగా అందజేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలో ఉండే అన్ని సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

- శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో

సభలు, ర్యాలీలే టార్గెట్ జనం మధ్యలో చేరి చోరీలు

- ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు

హుస్నాబాద్, జూన్ 22 : రాజకీయ సమావేశాలు, సభలు, ర్యాలీలు జరుగుతున్నాయంటే చాలు ఆ ముఠా కార్యకర్తల్లా వారితో కలిసిపోతుంది. ఎక్కడ ఇలాంటి కార్యక్రమం జరిగినా అక్కడ వాలిపోతుంటుంది. అందరూ ఆయా కార్యక్రమాల్లో నిమగ్నమై ఉండగా.. వారి జేబులను ఖాళీ చేయడం ఆ ముఠా ప్రత్యేకత. రెండు రోజుల క్రితం హుస్నాబాద్‌లో జరిగిన ర్యాలీలో పిక్ ప్యాకెటింగ్‌కు పాల్పడిన ముఠాను సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీసులు శనివారం రాత్రి అరెస్ట్ చేశారు. ఎస్ఐ తోట మహేశ్ నిందితుల వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన ఇట్ల అంజనేయులు, దేవరకొండ దుర్గారావు, ఖమ్మం జిల్లా మధిరకు చెందిన శ్రీరామ్ గోపి, భూపాల్లిలోని సుభాష్ కాలనీకి చెందిన రేవెల్లి రమేశ్, మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన కంప నానిలు ముఠాగా ఏర్పడ్డారు. వీరు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ రాజకీయ సభలు, సమావేశాలు, ర్యాలీలు జరిగినా అక్కడికి వచ్చి పిక్ ప్యాకెటింగ్ చేస్తారు. రెండు రోజుల క్రితం హుస్నాబాద్‌లో పలువురి జేబులు ఖాళీ చేశారు. నిందితులను హుస్నాబాద్‌లో అరెస్ట్ చేసి, వారి నుంచి కారు, అయిదు మొబైల్ ఫోన్లు, రూ. 6 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు పంపించారు. పాత నేరస్థులైన వీరు జైలులో ఏర్పడిన పరిచయాలతో ఇలా చోరీలకు పాల్పడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గజ్వేల్ కాంగ్రెస్‌లో గడబిడ..!

- నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల చిచ్చు
- గ్రూపులుగా విడిపోయిన నాయకులు
- మంత్రులను కలుస్తూ ఒకరిపై మరొకరు ఫిర్యాదు

గజ్వేల్, జూన్ 22: గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవులు చిచ్చురేపాయి. అంతా కలసిమెలసి ఉన్న నాయకులు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తున్నారు. డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు గ్రూపులుగా విడివడి పదవుల కోసం ప్రయత్నిస్తున్నారు.

అసమ్మతి రాగం

'నిన్న.. మొన్నటి వరకు నర్సారెడ్డి అంటే మేము.. మేము అంటే నర్సారెడ్డి' అన్నట్లుగా ఉన్న నాయకులు పదవి దక్కదని తెలిసి ఒక్కసారిగా అసమ్మతి రాగాన్ని అందుకున్నారు. నర్సారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ల కోసం కొందరి పేర్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. దీంతో అనుచరులుగా ఉన్న తమను కాదని ఇతరులకు పదవిని కట్టబెట్టడాన్ని జీర్ణించుకోలేని వారు టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్‌రావు చెంతకు చేరారు. నర్సారెడ్డిపై అసమ్మతితో ఉన్న పలువురు నాయకులకు తోడు నర్సారెడ్డి వెంట ఉన్న నాయిని యాదగిరి, మద్దూరి మల్లారెడ్డి, మోహన్నగారి రాజు, గోపాల్‌రావు లాంటి వారు జత కలిశారు. వీరంతా కలసి ఇటీవలే మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. నర్సారెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. నామినేటెడ్ పదవుల్లో పరిగణనలోకి తీసుకోలేదని ఆవేదనను వెళ్లబోసుకున్నట్లు తెలిసింది.

అంతే దీటుగా నర్సారెడ్డి

అసమ్మతి నాయకులు ప్రత్యేక కుంపటి పెట్టడంతో డీసీసీ అధ్యక్షుడిగా, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న నర్సారెడ్డి దీటుగా స్పందిస్తున్నారు. ఆయన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర్‌రావు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌లను కలసి నామినేటెడ్ పదవులకు సంబంధించిన వివరాలను అందజేశారు. అంతేకాకుండా గ్రూపులను ప్రోత్సహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. మొత్తంగా నియోజకవర్గంలో నామినెటెడ్ పదవుల పందేరం అధికార కాంగ్రెస్ పార్టీలో చిచ్చు రేపింది. ఇది ఎంత వరకు వెళ్తుందోనని కాంగ్రెస్ పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలు విచారం వ్యక్తం చేస్తున్నారు.



గ్రూపులను ప్రోత్సహిస్తే సహించేది లేదు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ

గజ్వేల్, జూన్ 22 : గజ్వేల్ నియోజకవర్గంలో గ్రూపులను ప్రోత్సహిస్తే సహించేది లేదని దేవాదాయ, ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ అన్నారు. డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం రాత్రి సచివాలయంలో మంత్రులను కలిశారు. పీసీసీ స్థాయి నాయకుడు గజ్వేల్‌లో గ్రూపులను ప్రోత్సహిస్తున్నాడని, ఎన్నికల్లో ఆయన అనుచరులు బీజేపీ పార్టీకి పనిచేశారని ఆధారాలతో సహా నర్సారెడ్డి మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో గజ్వేల్‌లో నర్సారెడ్డి ఆధ్వర్యంలో మెరుగైన ఫలితాలు వచ్చాయని, ఆయనే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అని తెలిపారు. ఆయన సూచించిన వారికే పదవులు ఇస్తామన్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో తుపాకులపల్లి వాసి మృతి

● ఇమాంపూర్ చౌరస్తా వద్ద ఘటన



ముత్యాలు(ఫైల్)

తూప్రాన్, జూన్ 22: నిత్యావసర సరుకులు తెచ్చేందుకు టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనక నుంచి వచ్చిన కారు, కంటైనర్ లారీలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన తూప్రాన్ మండలం ఇమాంపూర్ చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకున్నది. తూప్రాన్ ఎస్‌ఐ-2 యాదగిరి కథనం ప్రకారం.. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పరికిబండ గ్రామపంచాయతీ పరిధి తుపాకులపల్లి గ్రామానికి చెందిన ఏశం ముత్యాలు(50) నిత్యావసర వస్తువులు తెచ్చుకోడానికి టీవీఎస్ ఎక్సెల్‌పై తూప్రాన్ పట్టణానికి బయలుదేరాడు. తూప్రాన్ మండలం ఇమాంపూర్ చౌరస్తా సమీపంలో ముందుగా వెళ్తున్న ముత్యాలును వెనక నుంచి వస్తున్న కంటైనర్ లారీ, కారు ఢీకొన్నాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ముత్యాలు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య భాగ్యమ్మ, కూతురు, కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదగిరి వివరించారు.

రోడ్డేశారు.. స్తంభం మరిచారు..



మర్రిముచ్చాల గ్రామంలో రోడ్డు మధ్యలో విద్యుత్‌స్తంభం

చేర్యాల, జూన్ 22: ఇలాంటి ఫొటోలు సోషల్‌మీడియాలో కనిపిస్తే.. నిజంగా ఇలా కూడా జరుగుతుందా? అని ఆశ్చర్యపోతుంటాం. కానీ, సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలో అధికారులు దానిని నిజం చేశారు. ఇంతకీ ఏం జరిగిందంటే.. సిద్దిపేట- జనగామ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల గ్రామంలో సర్వీస్ రోడ్డు వేస్తున్నారు. ఈ సర్వీస్ రోడ్డు కోసం గ్రామానికి ఆనవాలుగా నిలిచిన భారీ మర్రిచెట్టును నరికివేశారు. తర్వాత బీటీ రోడ్డు పనులు ప్రారంభించగా.. పాత రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభం ఇలా రోడ్డు మధ్యలోకి వచ్చేసింది. అయినా.. రోడ్డు వేస్తూ వెళ్లిపోయారు. కనీసం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ గానీ, అధికారులు కానీ స్తంభం రోడ్డు మధ్యలోకి వచ్చిందన్న విషయాన్ని గమనించారో లేదు. లేక.. అది తమ పని కాదు.. రోడ్డు వేయడమే ముఖ్యం అనుకున్నారో ఏమో.. ఈ రోడ్డుపై చీకటి వేళ స్తంభం కనిపించకుండా ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిదో మరి..

హెచ్‌సీఏ ఓపెన్ సెలెక్షన్స్



దేవ్‌రాజ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఉమెన్స్ లీగ్ కోసం వర్ధమాన మహిళా క్రికెటర్లను ఎంపిక చేసేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఓపెన్ సెలెక్షన్స్ నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం కార్యదర్శి ఆర్.దేవ్‌రాజ్ వెల్లడించారు. ఈనెల 29, 30 తేదీల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉప్పల్ స్టేడియంలో సెలెక్షన్స్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల క్రికెటర్లు సోమవారం నుంచి (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. హెచ్‌వైసీ.క్రికెట్.ఇన్) వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని చెప్పారు. గతంలో బీసీసీఐ టోర్నమెంట్స్, హైదరాబాద్ క్రికెట్ అకాడమీలో శిక్షణ తీసుకున్న వారు, తెలంగాణ పౌరులు కానీ వారు ఈ సెలెక్షన్స్‌లో పాల్గొనడానికి అనర్హులు అని దేవ్‌రాజ్ తెలిపారు.

జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపిక




పాఠశాల గదులు శుభ్రం చేసే డెస్ట్ లిఫ్ట్ ప్రాజెక్టుతో విద్యార్థి స్రవంతి, వీధిదీపాలను అమర్చే నమూనా ప్రాజెక్టుతో విద్యార్థి మహ్మద్ ముస్తఫా అహ్మద్

సంగారెడ్డి అర్బన్, జూన్ 22: జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు (ఇన్‌స్పైర్ మనక్) సంగారెడ్డి జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. అందోల్ మండలం కన్‌సాన్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి స్రవంతి పాఠశాల గదులు శుభ్రం చేసే డెస్ట్ లిఫ్ట్, అదే విధంగా కోహీర్ మండలం కావేలి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి మహ్మద్ ముస్తఫా అహ్మద్ వీధిదీపాలను సులభంగా అమర్చే నమూనాలను రూపొందించారు. ఆయా ప్రాజెక్టులు జిల్లా, రాష్ట్రస్థాయిలో ముందంజలో నిలిచి జాతీయస్థాయికి ఎంపికకావడం పట్ల వారిని డీఈవో వెంకటేశ్వర్లు, నోడల్ ఆఫీసర్ లింబాజీ, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, ఆయా మండలాలు ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్లు అభినందించారు.

వర్షాకాలం.. జరభద్రం

● విద్యుత్‌పై నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికే ముప్పు ● జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ



దౌల్తాబాద్ మండల కేంద్రంలో విద్యుత్ మర్మతులు చేస్తున్న సిబ్బంది

దౌల్తాబాద్, జూన్ 22: దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఓ యువ రైతు ఇటీవల తన పొలం వద్ద విద్యుత్ మరమ్మతులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై తీవ్రగాయాల పాలయ్యాడు. బాధితుడిని మెరుగైన చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వర్షాకాలంలో చాలామంది రైతులు తరచూ విద్యుత్ ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో విద్యుత్‌తో బోరుబావులు, వాగులు, పొలాల వద్ద మోటార్లు ఏర్పాటు చేసి పంట సాగు చేస్తుంటారు. విద్యుత్ వినియోగంలో ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రాణాలకే ప్రమాదం, రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.



విద్యుదాఘాతంతో గాయాలైన బాధితుడిని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం(ఫైల్)

పరిహారం అందాలంటే..

విద్యుత్ సంస్థ కేవలం మూడు ప్రమాదాలకు మాత్రమే నష్టపరిహారం అంటే పశువులు, మనుషులు మృతిచెందితే పరిహారం అందిస్తున్నది. గాయాలకు పరిహారం ఉండదని వెల్లడిస్తున్నారు. మనుషులు మృతిచెందితే రూ.5 లక్షలు, ఆవులు, గేదెలు మృతిచెందితే రూ.45 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లిస్తారు. ప్రమాదం జరిగిన స్థలంలోని వాటి చిత్రంతో పాటు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు, శవ పంచనామా పత్రాలను విద్యుత్ అధికారులకు సమర్పించాల్సిన ఉంటుంది. పశువులకైతే ఫొటోతో పాటు పశు వైద్యుడి పోస్టుమార్టం రిపోర్టును జతచేసి సమర్పించాలి.

అవగాహన కల్పించాలి



విద్యుత్ వినియోగంపై అధికారులు రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి. విద్యుత్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని రైతులకు అర్థమయ్యే విధంగా విద్యుత్ వినియోగంపై వివరిస్తే ఉపయోగం ఉంటుంది.

- రైతు, నర్ర రాజేందర్, దొమ్మాట

జాగ్రత్తలు తప్పనిసరి



ప్రమాదాల బారిన పడకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. లైన్‌మన్లను అందుబాటులో ఉంచుతూ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. లూప్‌లైన్లు వేలాడుతున్నా.. కిందపడిపోయినా విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

- వాసుదేవరావు, విద్యుత్ ఏఈ, దౌల్తాబాద్

ఇలా జరిగితేనే నష్టపరిహారం

- అకస్మాత్తుగా తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి మరణిస్తే
- తక్కువ ఎత్తులోని ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా మృతిచెందితే
- తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు తగిలి ప్రాణాలు పోతే

జాగ్రత్తలు

- మోటార్లను ప్రత్యేకంగా గద్దెలపై ఏర్పాటు చేసుకోవాలి
- స్టార్టర్ బోర్డు తడవకుండా చూసుకోవాలి
- మోటార్ పాడైతే మెకానిక్‌తోనే మరమ్మతు చేయించుకోవాలి
- సర్వీస్ వైర్లు, మోటార్‌కు నాణ్యమైన తీగలే వాడాలి
- వైర్లు దెబ్బతింటే వెంటనే టేపు వేసుకోవాలి
- సబ్ మెర్సిబుల్ మోటార్లలో విద్యుత్ వైర్ ఉంటుంది. ఏ వైరు తెగినా మోటార్ నుంచి పైన ఉండే వస్తువుల వరకు విద్యుత్ సరఫరా జరిగే అవకాశం ఉంటుంది.

మా భూములు తీసుకుంటే ఎలా బతకాలి..?

● సంగారెడ్డి కాలువకు భూములివ్వంటూ జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో

● ఆర్డీవో హామీతో రాస్తారోకో విరమణ



నర్సాపూర్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులకు నచ్చచెబుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

నర్సాపూర్, జూన్ 22: తరతరాలుగా ఆ భూములను నమ్ముకుని మా కుటుంబాలు బతుకుతున్నాయి. అలాంటి భూములను ఇప్పుడు కొండపోచమ్మ నుంచి తీయనున్న సంగారెడ్డి కాలువ కోసం తీసుకుంటామంటే మేం ఎలా బతకాలంటూ మెదక్ జిల్లా చిన్నచింతకుంట గ్రామ రైతులు శనివారం జాతీయ రహదారిపై రాస్తారో చేశారు. కొండసంగారెడ్డి కెనాల్ కోసం రైతుల నుంచి భూసేకరణకు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో మూడురోజులుగా గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం మండలంలోని చిన్నచింతకుంట గ్రామ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న రైతులు సంగారెడ్డి కెనాల్ త్వరలో చేపట్టనున్న రీజినల్ రింగురోడ్డు లోపల ఏర్పాటు కానున్నదని, దీంతో ఈ ప్రాంతం పట్టణీకరణ దిశగా అభివృద్ధి చెందే అవకాశం ఉండడంతో తమ గ్రామాల గుండా కాలువ వద్దంటూ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఆర్డీవో స్పందిస్తూ తన చేతిలో నిర్ణయం తీసుకునే అవకాశం లేదని, కేవలం మీ అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా ఇస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. వినతిపత్రం ఇచ్చి బయటకు వచ్చిన చిన్నచింతకుంట రైతులు మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసనకు దిగారు. దీంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఆర్డీవో అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తమ కుటుంబాల ఈ భూములపైనే ఆధారపడి బతుకుతున్నాయని, మా భూములు తీసుకుంటే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా పరిహారం విషయమై ఇప్పటికీ స్పష్టత ఇవ్వకుండా భూములు తీసుకోవడానికి ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమని అన్నారు. రూ.50 లక్షలకు పైగా ఎకరా పలుకుతున్న భూములకు అరకొర పరిహారం ఇస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. కాలువలకు బదులు పైపుల ద్వారా నీటిని తరలించాలన్నారు. మీ ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీవో హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ నిరసనలో చిన్నచింతకుంట రైతులు నర్సింహారెడ్డి, కిష్టాగౌడ్, మహేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.



సంగారెడ్డిలోని బతుకమ్మకుంట కట్టను తొలగించి పైపులను వేస్తున్న అధికారులు

కుంట కట్టను తవ్వి చెరువులోకి మురుగునీరు

● మంత్రి చెప్పారంటూ మున్సిపల్ అధికారుల నిర్వాకం

● పనులను అడ్డుకున్న కాలనీవాసులు

సంగారెడ్డి టౌన్, జూన్ 22: చెరువులో కలుషితమవుతున్న నీటిని శుద్ధి చేయాల్సిన అధికారులే చెరువులోకి మురుగునీటిని తరలించేలా చర్యలు చేపట్టారు. పైగా మంత్రి చెప్పారంటే అత్యుత్సాహాన్ని ప్రదర్శించడం శోచనీయం. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి హౌసింగ్ కాలనీలో బతుకమ్మకుంట కట్టను అధికారులు దగ్గరుండి తవ్వేస్తుండగా శనివారం కాలనీవాసులు అడ్డుకున్నారు. బతుకమ్మకుంట కట్టను తవ్వేసి ఓ ప్రైవేట్ పాఠశాల నుంచి మురుగునీటిని తరలించేలా పైపులను వేశారు. ప్రైవేట్ పాఠశాలకు లబ్ధిచేకూరేలా చేస్తున్న పనులను కాలనీవాసులు అడ్డుకున్నారు. అయితే మంత్రి చెప్పారంటే మున్సిపల్ అధికారులు దగ్గరుండి కట్టను తవ్వేసి పైపులైన్ వేయడం కాలనీవాసులకు ఆగ్రహం తెప్పించింది. తామంతా మంత్రిని కలిసి సమస్యను వివరిస్తామని అధికారులకు చెప్పారు. ఇరిగేషన్ అధికారులకు సమాచారం లేకుండా బతుకమ్మ కుంట కట్టను మున్సిపల్ అధికారులు తవ్వేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డీసీసీబీ పరిధిలో 57,585 మంది రైతులకు విముక్తి

● రూ.451కోట్ల రుణ మాఫీ

● డీసీసీబీ చైర్మన్ చిట్టిదేవేందర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చిట్టిదేవేందర్‌రెడ్డి

సంగారెడ్డి టౌన్, జూన్ 22: ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ పరిధిలోని 57,585 మంది రైతులకు రూ.451 కోట్ల రుణమాఫీ కానున్నదని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డిలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2 లక్షల వరకు రుణాలను ఏకకాలంలో మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం శుభపరిణామమన్నారు. ఉమ్మడి జిల్లా డీసీసీబీ పరిధిలోని సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు చెందిన 57,585 మంది రైతులకు లబ్ధి చేకూరనున్నదని పేర్కొన్నారు. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ మధ్యలో రుణాలు తీసుకున్న రైతులకు రుణాలు మాఫీ కానున్నాయని వివరించారు. మాఫీ అయిన రైతులందరికీ డీసీసీబీ ద్వారా తిరిగి రూ.450 కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రెండు ఎకరాల భూమి కలిగిన రైతుల ఇళ్ల నిర్మాణానికి రుణాలు ఇవ్వనున్నామన్నారు. మండల కేంద్రాల్లో రూ.40 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.75 లక్షల వరకు రుణాలు ఇస్తున్నామని వివరించారు. వాణిజ్య బ్యాంకులకు ధీటుగా డీసీసీబీ ద్వారా మహిళా సంఘాలు, వాహనాలు, వ్యాపారాలకు కూడా పెద్దఎత్తున రుణాలు ఇస్తున్నామని దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు రమేష్, వెంకట్రాములు, చంద్రయ్యస్వామి, పద్మదుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న జట్లు

ఉత్సాహంగా ఫుట్‌బాల్ పోటీలు

మెదక్ అర్బన్, జూన్ 22: మెదక్ ఫుట్‌బాల్ అకాడమీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ క్రీడాకారుడు బెనర్జీ జయంతి సందర్భంగా శనివారం స్థానిక ఇందిరాగాంధీ మైదానంలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. 11 నుంచి 13 ఏళ్ల లోపు బాలబాలికలకు, 14 నుంచి 16 ఏళ్ల బాలబాలికలతోపాటు 40 ఏళ్లపైబడిన పురుషులు పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన జట్లకు డీవైఎస్‌వో నాగరాజ్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అసోసియే

కాలనీలోకి వరద నీరు వెళ్లకుండా చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎక్స్‌కవేటర్‌తో పనులు చేయిస్తున్న దృశ్యం

నర్సాపూర్, జూన్ 22: నర్సాపూర్ పట్టణం 9వ వార్డులోని విజ్ఞేశ్వర కాలనీవాసులు వరదనీటితో పడే ఇబ్బందులపై 'ఆ కాలనీకి శాపం' అనే శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వరదనీరు కాలనీలోకి వెళ్లకుండా ప్రస్తుతానికి ప్రత్యేకంగా కాలువ తీసి బయటకు వెళ్లేలా ఎక్స్‌కవేటర్‌తో పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ వార్డుసభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు రవిబాబు మాట్లాడుతూ ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు.

శిథిలమవుతున్న రికార్డులు

● పట్టించుకోని ప్రధానోపాధ్యాయులు

● ఆన్‌లైన్‌లోనే అడ్మిషన్ రిజిస్టర్లకు భద్రం

● జిల్లా విద్యాశాఖాధికారులు దృష్టిసారిస్తే విద్యార్థులకు మరింత సమాచారం



మద్దూరులో బీరువాలో శిథిలమైపోతున్న రికార్డులు

మద్దూరు, జూన్ 22: సిద్దిపేట జిల్లాలో సుమారు 20 ఏళ్ల క్రితం నుంచి ఉన్న పాఠశాలల్లోని అడ్మిషన్ రిజిస్టర్లు, రికార్డులు శిథిలమైపోతున్నాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం యూడైస్ ప్లస్ పేరుతో విద్యార్థుల లెక్క పక్కా నమోదుతో పాటు పాఠశాల సమగ్ర వివరాలను సేకరిస్తోంది. పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల, సౌకర్యాల పూర్తి సమాచారంతో అన్ని రాష్ట్రాల విద్యార్థుల వివరాలు ఒకే పోర్టల్‌లో ఉండాలని ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చేపట్టింది. మధ్యాహ్న భోజనం, అల్పాహారం, ఏకరూప దుస్తులు, పుస్తకాలు, ఉపకార వేతనాలు, రవాణా భత్యం తదితర పథకాలకు యూడైస్‌లోని వివరాల ఆధారంగా బడ్జెట్ కేటాయించనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో శిథిలమవుతున్న అడ్మిషన్ రిజిస్టర్లకు ప్రత్యేక యాప్ క్రియేట్ చేసి భద్రపరిస్తేనే భవిష్యత్తులో విద్యార్థులకు కావాల్సిన సమాచారం అభ్యమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.


సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలో సుమారు 1950లో పాత వరంగల్ జిల్లాలోని జనగామ తాలుకాలో మద్దూరులో పాఠశాల ఏర్పాటు అనంతరం దూళిమిట్టలో 1960లో, లద్నూరులో 1962లో మాత్రమే పాఠశాలలు ఏర్పాటయ్యాయి. తదనంతరం సలాఖ్‌పూర్, నర్సాయపల్లి, రేబర్తి, బైరాన్‌పల్లి, డీఎన్‌టీ కూటిగల్, కొండాపూర్‌తో పాటు మోడల్‌స్కూల్, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలు హైస్కూళ్లుగా ఏర్పడ్డాయి. ఉమ్మడి మద్దూరు మండలంలో మద్దూరు క్లస్టర్‌లో హైస్కూల్స్ 3 యూపీఎస్‌లు 1, పీఎస్‌లు 5, రేబర్తి క్లస్టర్‌లో హైస్కూల్స్ 2, యూపీఎస్‌లు 2, పీఎస్‌లు 5, దూళిమిట్ట క్లస్టర్‌లో హైస్కూల్స్ 4, యూపీఎస్‌లు 2, పీఎస్‌లు 11 ఉన్నాయి. కాగా విద్యార్థులు లేకపోవడంతో సుమారు 15 ఏళ్ల క్రితం లక్కపల్లిలోని పీఎస్‌తో పాటు మద్దూరులోని ఎస్సీ కాలనీలోని పీఎస్ మూతపడ్డాయి.

పాడైన అడ్మిషన్ రిజిస్టర్లు

ఉమ్మడి మద్దూరు మండలంలో సుమారు 20 ఏళ్ల క్రితం నుంచి ఉన్న అన్ని పాఠశాలల్లోని అడ్మిషన్(ప్రావేశిక, నిష్క్రమణ పుస్తకం) రిజిస్టర్లు దాదాపుగా శిథిలమైపోతున్నాయి. ఫర్నిచర్, బీరువాలు పాతవైపోయాయి. భద్రంగా దాచిన అడ్మిషన్ రిజిస్టర్లు, రికార్డులు ముట్టుకుంటేనే కాగితాలు విచ్చుకుపోతున్నాయి. పూర్వ విద్యార్థులకు ఏదేని సమాచారం అందివ్వాలంటే అడ్మిషన్ రిజిస్టర్లు ముట్టుకునే పరిస్థితులు లేకుండా ఉన్నాయి. రిజిస్టర్లు తెరిస్తే కమ్మలు(పేపర్లు) ముక్కలుగా విరిగిపోతున్నాయి. ఎంతో జాగ్రత్తగా భద్రపరిచినా సమాచారం తీసుకోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. జిల్లా విద్యాశాఖాధికారులు ప్రత్యేక దృష్టిసారించి వీటి భద్రతకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన యూడైస్ ప్లస్ మాదిరిగా ఆన్‌లైన్ ప్రక్రియకు చర్యలు తీసుకుంటే తప్ప.. మార్గం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.



లక్కపల్లిలో పశువుల దొడ్డిగా మూతపడ్డ ప్రాథమిక పాఠశాల



మద్దూరులో శిథిలమైన అడ్మిషన్ రిజిస్టర్

సమాచారం ఇవ్వలేని పరిస్థితి

విద్యార్థులు సమాచారం కోసం వస్తే ఇవ్వలేని పరిస్థితి ఉన్నది. రికార్డు తెరిస్తే పేజీలు ఊడిపోతున్నాయి. జిల్లా విద్యాశాఖాధికారులు దృష్టిసారించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలి. అప్పుడు పూర్వ విద్యార్థులకు సమాచారం అందించే అవకాశం ఉన్నది.

- శ్రీశైలం, యూపీఎస్ హెచ్‌ఎం, మద్దూరు

ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన

● జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ

మద్దూరు, జూన్ 22: ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన జరుగుతున్నదని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలలను బతికించుకోవాల్సిన అవసరముందని జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌శర్మ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు సరిపడ ఉపాధ్యాయులున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి పాఠశాలలను బతికించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం, ఎంపీటీసీ బొప్పె కనకమ్మ, మాజీ సర్పంచ్ కంఠారెడ్డి జనార్ధన్‌రెడ్డి, చైర్‌పర్సన్ ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ.. ఇదేం దుస్థితి..!

● పెచ్చులూడుతున్న స్లాబ్
● పనులను వదిలేసిన కాంట్రాక్టర్
● నామమాత్రంగా అభివృద్ధి కమిటీల తీరు

నారాయణరావుపేట, జూన్ 22: పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నది. రోగులకు సేవలు అందించే విషయంలో నాడు రాష్ట్రస్థాయిలో ప్రశంసలు అందుకున్న నారాయణరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేడు చిన్నపాటి వర్షానికే పెచ్చులుడుతున్నది. ఏ క్షణంలో స్లాబు పెచ్చులుడి మీద పడతాయో తెలియని దుస్థితి నెలకొన్నది. పీహెచ్‌సీ గోడల్లో చెట్లు మొలకెత్తి పగుళ్లు ఏర్పడ్డాయి.

చువ్వలు కనిపిస్తున్న పైకప్పు

ప్రసూతి గది, ఇన్ పేషెంట్‌లకు చికిత్సను అందించే వార్డుతో పాటు మరికొన్ని గదుల్లో స్లాబు పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు కనిపిస్తున్నాయి. చిన్నపాటి వర్షానికే భవనం గోడలు తేమ రావడంతో రోగులు, సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. వీటికి తోడు ఆరోగ్య కేంద్రంలో మహిళా సిబ్బంది, చికిత్స కోసం వచ్చిన మహిళలు మరుగుదొడ్లు సక్రమంగా లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు.

నామమాత్రంగా అభివృద్ధి కమిటీ

నారాయణరావుపేట పీహెచ్‌సీ నుంచి 20 గ్రామాల్లో 7 ఆరోగ్య ఉపకేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నారు. పేదలకు సకాల సౌకర్యాలు సమకూర్చేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించాల్సిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నామమాత్రంగానే మారింది. ఎప్పటికప్పుడు కమిటీ సమావేశమై ఆరోగ్య కేంద్రం అభివృద్ధి నిధుల వినియోగంపై చర్చించి, వసతులు కల్పించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులతో కూడిన అభివృద్ధి కమిటీ సమావేశం రికార్డులకే పరిమితం అయిందన్న ఆరోపణలు లేకపోలేదు.



ప్రసూతి గదిలో పెచ్చులూడుతున్న స్లాబు





అసంపూర్తిగా వాష్‌బేషిన్, టాయిలెట్స్ పనులు

పనులను మధ్యలోనే వదిలేసిన కాంట్రాక్టర్

మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు, సిబ్బందికి, ప్రజలకు సౌకర్యాల కల్పనకు, మరమ్మతులకు ప్రభుత్వం 2022-2023 సంవత్సరంలో 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.35లక్షల నిధులు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మరమ్మతులు చేపట్టాడు. ఏవో కారణాలతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేశాడు. దీంతో వైద్య సేవలకు తీవ్ర ఆంటకం ఏర్పడుతున్నది. మరుగుదొడ్లు సరిగా లేకపోవడంతో విధులకు రావాలంటేనే సిబ్బంది జంకుతున్నారు. వెంటనే మరమ్మతుల పనులు ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం

పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మరమ్మతులను మధ్యలోనే నిలిపివేయడంతో సేవలకు ఆటంకం కలుగుతున్నది. పీహెచ్‌సీ పరిధి ఎక్కువగా ఉన్నందున వివిధ గ్రామాల నుంచి ప్రజలు చికిత్స నిమిత్తం వస్తుంటారు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి.

- బాపురెడ్డి, మెడికల్ అధికారి, నారాయణరావుపేట పీహెచ్‌సీ

అర్ధరాత్రి బతుకమ్మ చీరల తరలింపు

● అడ్డుకున్న కాంగ్రెస్ నేతలు



ఆటోలో తీసుకెళ్లేందుకు సిద్ధం చేసిన బతుకమ్మ చీరలు

సిద్దిపేట అర్బన్, జూలై 22: సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) కార్యాలయం వద్ద శనివారం రాత్రి హైడ్రామా నెలకొంది. కార్యాలయం వద్దకు రాత్రి సుమారు 10 గజుల సమయంలో ఆటో రావడంతో కాంగ్రెస్ శ్రేణులు వచ్చి ఆందోళనకు దిగాయి. ఆటోలో అంత రాత్రి వేళ ఏం తీసుకువెళ్తున్నారని ఆటో ఉన్న వారిని ప్రశ్నించగా, బతుకమ్మ చీరలు తీసుకెళ్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు రెండు ఆట్లో కార్యాలయ ఫైళ్లు, ఫర్నిచర్ తీసుకెళ్లారన్నది కాంగ్రెస్ ఆరోపణ. బతుకమ్మ చీరలు తరలిస్తే ఇంతకు ముందు తరలించినవి ఎక్కడ ఉన్నాయో చూపించాలని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ వివరాలు తెలుసుకున్నారు.

'నీట్'ను నిరసిస్తూ ప్రధాని దిష్టిబొమ్మ దహనం



ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కోహెడ/హుస్నాబాద్, మే 22: మండల కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టి బొమ్మను మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం దహనం చేశారు. నీట్ పరీక్ష లీకేజీని నిరసిస్తూ, అందుకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శెట్టి సుధాకర్, తిరుపతిరెడ్డి, గూడ స్వామి, బైరీ సుధాకర్, చెన్నారెడ్డి, ముంజ శివసాయి, ఏళ్లబోయిన శ్రీకాంత్ యాదవ్, ఆవుల మహేందర్, ప్రశాంత్, రంజిత్, అన్నాడి రాజేందర్‌రెడ్డి, సంజీవ్, సురేష్, సాయి పాల్గొన్నారు.

నీట్ పరీక్షల అవకతవకలపై కేంద్రం వెంటనే విచారణ జరపాలని శనివారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి బీఆర్‌ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. పేపర్ లీక్ కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందని, కానీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, చిరంజీవి, సతీష్, జీవన్, బాస్కర్, లక్ష్మన్, సునీతా, లక్ష్మీ, పద్మ తదితరులున్నారు.

విద్యా వ్యవస్థను గాలికి వదిలేసిన ప్రభుత్వం

● బీఆర్‌ఎస్వీ నాయకులు

సిద్దిపేట క్రైం, జూన్ 22: రాష్ట్రంలో విద్యా వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి ఆరోపించారు. శనివారం ఆయన బీఆర్‌ఎస్వీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పాఠశాలలు ప్రారంభమై పది రోజులు గడుస్తున్నా, విద్యార్థులకు కనీసం పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్ కూడా అందించకుండా ప్రభుత్వం ఆలస్యం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేయడం మంచి పద్ధతి కాదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యార్థినులకు ద్విచక్రవాహనాలను అందిస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైంది అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త పయ్యావుల శ్యామ్, పట్టణాధ్యక్షుడు మహిపాల్‌గౌడ్, వివిధ మండలాల అధ్యక్షులు గుజ్జ రాజు, గోవిందారం రవి, బండి శ్రీకాంత్, పెర్క మధు, భానుచందర్, ఇరుగంటి రమేష్, అప్పాల శేఖర్, రాగారం గ్రాము, శ్రావణ్‌గౌడ్, ప్రశాంత్, నరేష్‌యాదవ్, మెరుగు మాధవ్, రాజశేఖర్‌రెడ్డి, షైలారం వంశీ, పోతుల నరేష్, బాలకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి చిరునామా బీఆర్‌ఎస్సే

● కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తూ ఇమామ్

సిద్దిపేట క్రైం, జూన్ 22: భూకబ్జాలకు, అవినీతికి చిరునామాగా బీఆర్‌ఎస్ నాయకులు నిలుస్తున్నారని కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తూ ఇమామ్ విమర్శించారు. శనివారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట పట్టణంలోని అన్నీ వార్డుల్లో నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇల్లు కేటాయిస్తే, కౌన్సిలర్లు డబ్బులకు అమ్ముకున్నారని ఆరోపించారు. పైగా దొంగే దొంగ అన్నట్లుగా వారు వ్యవహరిస్తున్నారని ఎద్దేవాచేశారు. అవినీతి భరించలేక కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ ప్రధాన కార్యదర్శి గ్యాదరి మధు. సిద్దిపేట పట్టణ యువజన అధ్యక్షుడు గయాజుద్దీన్. ఎన్‌ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రాషాద్. నజ్జు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

చేర్యాల/వర్గల్, జూన్ 22: చేర్యాల పెద్దమ్మగడ్డ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జడ్పీఎస్‌ఎస్ ఉపాధ్యాయుడు రాకేశ్‌రెడ్డి నోటుబుక్కులు, స్టేషనరీని విరాళంగా అందించాడు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాబు చేతులమీదుగా పంపిణీ చేశారు.

వర్గల్‌మండలంలోని శేరిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం హైదరాబాద్‌కు చెందిన మల్లికార్జున్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5 సంవత్సరాలుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్, నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, ఉపాధ్యాయుడు శ్యామ్ సుందర్‌రావు, గ్రేస్ లిల్లీ, కృష్ణారావు, నాగేందర్‌రావు ఉన్నారు.

ఎంపీని కలిసిన గుడాల శేఖర్‌గుప్తా

మర్కుక్, జూన్ 22: మెదక్ ఎంపీ రఘునందన్‌రావును హైదరాబాద్‌లో శనివారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం చేబర్తి గ్రామ మాజీ కోఆప్షన్ సభ్యుడు, సారథి ఫౌండేషన్ చైర్మన్ గుడాల శేఖర్‌గుప్తా మర్యాదపూర్వకంగా కలిశారు. భారీ మెజారిటీతో మెదక్ ఎంపీగా విజయం సాధించిన రఘునందన్‌రావుకు శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు. కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ములుగు, జూన్ 22: మండలంలోని వంటిమామిడి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు నేడు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. లక్ష్మక్కపల్లి, చిన్న తిమ్మాయపల్లి, జప్తిసింగాయపల్లి గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

యువతి అదృశ్యం

గజ్వేల్, జూన్ 22: ప్రజ్ఞాపూర్‌లో యువతి అదృశ్యమైన సంఘటన శనివారం చోటుచేసుకున్నది. ప్రజ్ఞాపూర్‌కు చెందిన చెట్కూరి పద్మ పనికి వెళ్తున్నానని ఉదయం ఐదు గంటలకు వెళ్లి తొమ్మిది గంటలకు వచ్చింది. ఇంట్లో తన కూతురు చెట్కూరి నవ్య(19) లేకపోవడంతో చుట్టు పక్కల వెతికింది. ఎక్కడా ఆమె కనిపించకపోవడంతో గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ సీఐ బి.సైదా తెలిపారు.

బెల్టు షాపులపై దాడులు

కోహెడ, జూన్ 22 : కోహెడ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద సముద్రాలలో బెల్టు షాపులపై టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన వేముల చంద్రమౌళి, వేముల మల్లేశం, బుక్క చంద్రం, మౌతమ్ నాగరాజు, పోలోజు సంపత్‌ల కిరాణా షాపుల్లో అక్రమంగా నిల్వ చేసిన విస్కీ, బీర్లు, లిక్కర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఐదుగురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు.

మల్లన్న ఆలయ డ్రైవర్ మృతి పట్ల సంతాపం

చేర్యాల, జూన్ 22: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో డ్రైవర్‌గా పని చేస్తున్న వరంగల్ రూరల్ జిల్లా మొగుల్లపల్లి కి చెందిన శ్రీపతి తిరుపతిగౌడ్(53) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. ఆలయ ఈవో బాలాజీశర్మ ఫోన్‌లో మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల కోసం రూ.20వేలు ఆలయం తరఫున అందించారు. ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్ మృతుడి స్వగ్రామానికి వెళ్లి కుటుంబసభ్యులకు నగదు అందజేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 25 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, జూన్ 22: సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో, రాజీవ్ రహదారిపై వాహనాల తనిఖీల్లో మద్యం సేవించి 25 మంది పట్టుబడ్డారు. వారిని శనివారం సిద్దిపేట కోర్టులో హాజరుపరచగా విచారణ చేసి వారికి రూ.14,100 జరిమానా విధించారు.

ముగిసిన జాతర

హుస్నాబాద్, జూన్ 22: నెల రోజుల పాటు కొనసాగిన హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ జాతర శనివారంతో ముగిసింది. మే 23వ తేదీ నుంచి జూన్ 22 వరకు ఈ జాతర అంగరంగ వైభవంగా జరిగింది. గతం కంటే ఈసారి 1.50 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

'ప్రమాణాలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలి'

గజ్వేల్, జూన్ 22: ప్రమాణాలు పాటించి ప్రాణాలను కాపాడుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారి కుమార్ అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. వారితో లీడింగ్ ఫైర్‌మెన్ చంద్రారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి, డైరెక్టర్ థామస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ విజయపాల్‌రెడ్డి, కాటరాయప్ప, అగ్నిమాపక సిబ్బంది సతీష్, సిద్ధిరాములు, నాగరాజు, రవికుమార్ తదితరులు ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

కుకునూరుపల్లి, జూన్ 22: మండలంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ సూపరింటెండెంట్ జయపాల్‌కి పీఏసీఎస్ డైరెక్టర్ నరసింహచారి శనివారం వినతిపత్రం అందజేశారు. మంగోల్, కొనాయిపల్లి, మాత్‌పల్లి, తిప్పారం, మెదినిపూర్ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. సూపరింటెండెంట్ సానుకూలంగా స్పందించి బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



తలకొరివి పట్టిన కూతురు

మర్కుక్, జూన్ 22: మండలంలోని చేబర్తికి చెందిన చాట్లపల్లి మల్లేశం అనే వ్యక్తి అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. గతంలోనే పెద్ద కూతురు చనిపోవడంతో రెండో కూతురు తండికి తలకొరివి పెట్టింది. జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డిలు మృతుని కుటుంబానికి రూ. 12 వేల ఆర్థిక సాయాన్ని స్థానిక తాజా మాజీ సర్పంచ్ అశోక్, ఉపసర్పంచ్ స్వామిలతో మృతుడి కుటుంబసభ్యులకు అందించారు. వారితో రైతుబంధు గ్రామ కోఆర్డినేటర్ జాలని బాల్‌నర్సయ్య, వార్డుసభ్యులు బాల్ నర్సయ్య, నాయకులు చాట్లపల్లి నర్సింహులు, గ్యార మల్లేశం, కాంగ్రెస్ నాయకులు ర్యాకం యాదగిరి, యువకులు శమ్మని రాజు తదితరులు ఉన్నారు.

'వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి మండలం వారికే ఇవ్వాలి'

ములుగు, జూన్ 22: ములుగు మండలం వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మండల వారికే ఇవ్వాలని పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గుంగిశెట్టి శ్రీనివాస్‌గుప్తా కోరారు. శనివారం హైదరాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ అయిందని, కష్టకాలంలో కాంగ్రెస్ కోసం పనిచేసిన వారికే అవకాశం కల్పించాలన్నారు. జిల్లా డీసీసీ అధ్యక్షుడు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి మండలంలో గ్రూప్ రాజకీయాలు చేస్తున్నారని మంత్రికి తెలిపారు. ఆయనవెంట కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నల్ల శ్రీనివాస్‌తో పాటు తదితరులు ఉన్నారు.


వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ కీర్తి, తదితరులు

కోహెడ, జూన్ 22: మండలంలోని శనిగరం గ్రామంలో 60 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు నిర్మాణానికి ఎంపీపీ కొక్కుల కీర్తి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి ఎద్దడి నివారణకు ట్యాంక్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. నిధుల మంజూరుకు కృషి చేసిన రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొంపెల్లి స్వప్న శశిధర్, మాజీ సర్పంచులు కర్ర శ్రీహరి, కర్ర జయశ్రీ రవీందర్, గాదె శ్రీధర్, మిషన్ భగీరథ డీఈఈ రుహీనా, ఏఈ ప్రియాంక, పంచాయతీ కార్యదర్శి చంద్రం, అబ్దుల్ రహీం, తదితరులు పాల్గొన్నారు.

'సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి'



తొగుట: ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా వివరిస్తున్న దృశ్యం

తొగుట/దౌల్తాబాద్, జూన్ 22: సైబర్ నేరాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తొగుట ఎస్‌ఐ లింగం సూచించారు. శుక్రవారం రాత్రి తొగుట మండలం ఎల్లారెడ్డిపేటలో పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనువిప్పు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్, ఆధార్ కార్డు వివరాలు గుర్తుతెలియని వ్యక్తులకు చెప్పవద్దని సూచించారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో పోలీసు కళాబృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు శ్యాంసుందర్, కనకయ్య, బిక్షపతి, హరిప్రసాద్, ప్రకాశ్, శైలజ పాల్గొన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని దౌల్తాబాద్ ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ అన్నారు. మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో శనివారం సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. వ్యక్తిగత వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ విక్రమ్, సాయి పాల్గొన్నారు.

నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు

చిన్నకోడూరు, జూన్ 22: చిన్నకోడూరు పోలీసు స్టేషన్ పరిధిలోని చిన్నకోడూరు, అనంతసాగర్, గుర్రాలగొంది గ్రామాల్లో శనివారం పోలీసులు నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మురళీధర్‌గౌడ్ మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను సమూలంగా నిర్మూలించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఆయనవెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

కొమురవెల్లికి కొత్త ఎస్‌ఐ వచ్చేనా!?

● నెలరోజులుగా పోస్ట్ ఖాళీ
● పైరవీలు నడుపుతున్న వైనం

చేర్యాల, జూన్ 22: కొమురవెల్లి ఠాణాకు కొత్త ఎస్‌ఐ వచ్చేనా? అని మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఎస్‌ఐ నాగరాజు నెలరోజుల క్రితం సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆయన స్థానంలో మరో ఎస్‌ఐని నియమించలేదు. దీంతో చేర్యాల సీఐ శ్రీను ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నప్పటికీ, ప్రతీ విషయంలో మండల ప్రజలు చేర్యాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొనడంతో ఇబ్బందులుపడుతున్నారు. అరకొర వసతుల నడుమ ఆలయ గెస్టహౌజ్‌లో కొనసాగున్న ఠాణాలో సిబ్బంది కూడా అంతంతమాత్రం ఉండగా, ఎస్‌ఐ లేకపోవడంతో మరిన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అంతేకాకుండా జవాబుదారీతనం కొరవడుతుండడంతో ప్రజలు ఉసూరుమంటున్నారు. పలువురు ఆడింది ఆట పాడింది పాటగా కొనసాగుతున్నది. సాగు సీజన్ కావడంతో గ్రామాల్లో నిత్యం వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. అంతేకాకుండా ఇతరత్రా సమస్యలతో ప్రజలు స్టేషన్‌ను ఆశ్రయిస్తున్నప్పటికీ, త్వరితగతిన ప్రయోజనం చేకూరడంలేదని వాపోతున్నారు. కొమురవెల్లిలో స్థానికంగా మల్లన్న ఆలయం ఉండటంతో ఎప్పుడు వీఐపీలు వస్తారో... స్థానికంగా నెలకొన్న రాజకీయ పరిణామాలతో ఎప్పుడు ఎలాంటి సంఘటనలు చోటుచేసుకుంటాయో తెలియని పరిస్థితి. రాష్ట్ర రాజధానికి చేరువగా ఉండడంతో పలువురు రియల్టర్లు, జల్సారాయుళ్లు గుట్టుచప్పుడు కాకుండా కొమురవెల్లి శివారు గ్రామాలలోని ఫాంహౌజ్, వ్యవసాయ తోటలలో విందులు కొనసాగిస్తూ, చాన్నాళ్లుగా పేకాట ఆడుతూ వస్తున్నారు. గతంలో పటిష్ఠ నిఘాతో పట్టుబడ్డారు.

పోస్ట్ కోసం పైరవీలు

జిల్లాలోని పొరుగు మండలానికి చెందిన ఓ సీఐ తన అనుచరుడైన ఓ ఎస్‌ఐని ఇక్కడికి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అంతేకాకుండా మరో పొరుగు మండలానికి చెందిన ఓ ఎస్‌ఐ ఇక్కడికి వచ్చేందుకు ప్రజాప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించినట్లు సమాచారం. అంతేకాకుండా అధికార పార్టీకి సంబంధించి ఓ ఎస్‌ఐని గుర్తించి ఖరారు చేసినట్లు ప్రచారం సాగుతున్నది.

ప్రభుత్వం న్యాయం చేయాలి

● మల్లన్నసాగర్ వాసుల విజ్ఞప్తి

గజ్వేల్, జూన్ 22: మల్లన్నసాగర్ భూనిర్వాసితుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని భూనిర్వాసిత గ్రామమైన లక్ష్మాపూర్ వాసులు కోరారు. గజ్వేల్ పట్టణంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో తమకు ఇచ్చిన అన్ని హామీలు నెరవేరుస్తామని చెప్పారని, తాత్కాలికంగా గజ్వేల్ పట్టణంలోని సంగాపూర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లలో వసతి కల్పించారని, సదరు ఇళ్లను లాటరీ ద్వారా గజ్వేల్ ప్రజలకు కేటాయించడంతో వారు ఇళ్లను ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. తమకు రావాల్సిన నష్టపరిహారం, ఇతరత్రా ప్యాకేజీలు అందజేస్తే తమ ఇళ్లను ఖాళీ చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం తమను ఆగం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం ఈ విషయమై వెంటనే స్పందించి, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

భక్తులతో కిటకిటలాడిన నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం

వర్గల్, జూన్ 22: మండలంలోని నాచాగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రద్దీ దృష్ట్యా అన్ని ఏర్పాట్లు చేసినట్లు కార్యనిర్వహణ అధికారి అన్నపూర్ణ తెలిపారు. వర్గల్ విద్యాధరి క్షేత్రంలో మూలమహోత్సవ వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం విద్యాసరస్వతీ అమ్మవారికి ఆలయ వేద పండితులు వేద మంత్రోశ్చరణ మధ్యన విశేష పంచామృతాభిషేకాలు, వేద విద్యార్థులతో లక్ష పుష్పార్చణ చేశారు. ఆలయ యాగశాలలో చండీ హోమం నిర్వహించారు. వేడుకల సందర్భంగా విద్యాధరి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. శంభుగిరి కొండలు భక్తి పారవశ్యంతో నిండిపోయింది.

వైభవంగా 'నవావరణ హవనం'

కొండపాక, జూన్ 22: మండలంలోని మర్పడగ గ్రామంలోని శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం నవావరణ హవనం నిర్వహించారు. క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ పర్యవేక్షణలో గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభమయ్యాయింది. మోహన కృష్ణశర్మ, వేదవ్యాసశర్మ, బి.లక్ష్మణరావులు హవనం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణా కమిటీ సభ్యులు గట్టు విఠల్, చీకోటి మల్లికార్జున్, రామచంద్రారెడ్డి, శ్రీశైలం, దేవసాని మల్లేశం, మర్యాల రవీందర్ ఉన్నారు.

లద్నూరులో డీఎల్‌పీవో ఆకస్మిక తనిఖీ

మద్దూరు, జూన్ 22: లద్నూరులో డీఎల్‌పీవో వెంకటేశ్వర్లు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, డంపింగ్‌యార్డు, స్మశాన వాటికతో పాటు నర్సరీని పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్‌కు సూచించారు. ఆయన వెంట ఎంపీవో ఖాజామొయినుద్దీన్ ఉన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ గురునానక్ సస్పెండ్

● ఉత్తర్వులు జారీ చేసిన సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, జూన్ 22: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పి. గురునానక్‌ను సీపీ అనురాధ సస్పెండ్ చేశారు. అతడు పోలీస్ డిపార్ట్‌మెంట్ సీసీఏ రూల్స్ అతిక్రమించి, క్రమశిక్షణ రాహిత్యంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపణలు రాగా విచారణ జరిపిన సీపీ శనివారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

'బండి'ని కలిసిన బీజేపీ నాయకులు

చిన్నకోడూరు, జూన్ 22: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని కరీంనగర్‌లోని ఆయన నివాసం వద్ద శనివారం మండలానికి చెందిన బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బీజేపీ సిద్దిపేట జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ముచ్చర్ల నాగరాజు, నాయకులు పిట్ల పరుశురాములు, మల్లం శ్రీనివాస్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాల్లో వైద్య సేవలు అందించడానికే ఉచిత శిబిరాలు'



పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొండపాక, జూన్ 22: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలు అందించడం కోసం క్షేత్రస్థాయిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజ్ డైరెక్టర్ విమల థామస్ అన్నారు. మండలంలోని మర్పడగలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మంచాల అనసూయ కనకరాములు, తహసీల్దార్ దిలీప్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజ్ డైరెక్టర్ విమల థామస్ మాట్లాడుతూ.. మర్పడగ గ్రామాన్ని సిద్దిపేట మెడికల్ కాలేజ్ విద్యార్థులచే దత్తత తీసుకుని ఆరోగ్య పరీక్షలు అందేలా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆంజనేయులు, రాజిరెడ్డి, కొండపాక పీహెచ్‌సీ వైద్యులు శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీకి ఆమోదం తెలపడం హర్షణీయం

● సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన తెలంగాణ రైతు రక్షణ సమితి

సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 22: రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ ప్రకటన చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మారెడ్డి రామలింగారెడ్డి రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. సిద్దిపేటలో శనివారం తెలంగాణ రాష్ట్ర రైతు రక్షణ సమితి నాయకులతో కలసి మాట్లాడారు.. గత ప్రభుత్వము రుణమాఫీ చేస్తామని అనడం వల్ల రైతులు బ్యాంకులకు వెళ్లలేక అప్పుల ఊబిలో కూరుకుపోయిన సంఘటనలు చూసామన్నారు. అటువంటి పరిస్థితులు ఈ ప్రభుత్వంలో రావని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కోశాధికారి పన్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా సలహాదారు వెంకట్రాంరెడ్డి, సంయుక్త కార్యదర్శి భూపతిరెడ్డి, ప్రచార కార్యదర్శి లక్ష్మయ్య, సిద్ధారెడ్డి, నరసింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజు, రైతులు పాల్గొన్నారు.



సిద్ది పేట అగ్రికల్చర్: మాట్లాడుతున్న తెలంగాణ రైతు రక్షణ సమితి నాయకులు



అక్కన్న పేట: సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం చిత్రపటాలకు అభిషేకం చేస్తున్న నాయకులు

● **కోహెడ:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణ మాఫీ చేయడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కోహెడలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్ర పటాలకు శనివారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు భీంరెడ్డి తిరుపతిరెడ్డి, దొమ్మాట జగన్‌రెడ్డి, శెట్టి సుధాకర్, బందెల బాలకిషన్, బైరి సుధాకర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు ఉన్నారు.

● **అక్కన్న పేట:** రెండు లక్షల రైతు రుణమాఫీ కేబినెట్ సమావేశంలో ఆమోదం పొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ, మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పంచామృత అభిషేకం నిర్వహించారు.